క్లుప్తంగా

ఘనంగా బుద్ధ పౌర్ణమి

పాకాల: మండల కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో కమిటీ అధ్యక్షుడు ఆనందయ్య ఆధ్వర్యంలో శుక్రవారం 2,567వ వైశాఖ బుద్ధ పౌర్ణమి సభను ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బహుజనహితాయ, బహుజన సుఖాయ అనే నినాదంతో ప్రపంచ వ్యాప్తంగా బుద్ధుడి ప్రభోదాలు వినిపిస్తున్నాయని తెలిపారు. ఇది ఒక మతం కాదని, జీవన విధానమని పేర్కొన్నారు. అనంతరం అంబేడ్కర్ జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆనందయ్య, డాక్టర్ రామకృష్ణ ఆవిష్కరించారు. విజయమోహన్, ప్రభు, నరసింహులు, శ్రీరాములు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని శుక్రవారం ఎమ్మెల్యే బ్రహ్మానాయుడు, స్టేట్ ఇన్‌కమ్ ట్యాక్స్ చీఫ్ హెడ్ వీకే గుప్తా, మాజీ సీనియర్ ఐఏఎస్ అధికారి ఎల్వీ సుబ్రమణ్యం, ఎమ్మెల్యే పెద్దారెడ్డి దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

క్లినికల్ గవర్నెన్స్ ఎంతో అవసరం

తిరుపతి తుడా: క్లినికల్ విభాగంలో గవర్నెన్స్ ఎంతో అవసరమని క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మాజీ సెక్రటరీ డాక్టర్ గిరిధర్ గ్యాని అన్నారు. పద్మావతి ఆడిటోరియంలో శుక్రవారం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేషనల్ ఇంపార్టెన్స్ అండ్ ఎమినెన్స్ అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి క్లినికల్ విభాగంలో ఆపరేషనల్ ఎక్సలెన్స్‌ను తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ వెంగమ్మ, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తిరుపతి రూరల్: అవిలాల సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, కొత్త సబ్ స్టేషన్‌కు విద్యుత్ సరఫరాకు అనుసంధానం చేయనున్నారు. ఈ నేపథ్యంలో శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్టు ఎస్పీడీసీఎల్ తిరుపతి డివిజన్ ఈఈ వాసుదేవరెడ్డి తెలిపారు. ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అవిలాల, ధనలక్ష్మీనగర్, ఎం.కె నాయుడు కాలనీ, సాయినగర్, సుబ్బయ్య కాలనీ, రాయలచెరువురోడ్డు, లింగేశ్వరనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

భాకరాపేట: ఆదర్శ పాఠశాలల్లో 2023–24 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశానికి పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఎర్రావారిపాళెం ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ బీటీ శ్రీదేవి తెలిపారు. తిరుపతి జిల్లా ఎర్రావారిపాళెం ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో విద్యార్థులను చేర్చుకోవడానికి జూన్ 11న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేడు శిల్పారామంలో సంగీత, నృత్యోత్సవాలు

తిరుపతి కల్చరల్: శ్రీసాయి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో శిల్పారామంలో భారతీయ సంగీత, నృత్యోత్సవాలు నిర్వహిస్తున్నట్లు అకాడమీ డైరెక్టర్ పరాంకుశం శరత్‌చంద్ర తెలిపారు. ఇందులో ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన కళాకారులు పాల్గొంటారని తెలిపారు. సంగీతం, భారత నాట్యం, కూచిపూడి, మోహినీ అట్టం, ఒడిస్సీ, జానపద నృత్యాలు ప్రదర్శిస్తారని పేర్కొన్నారు.

వైభవంగా చెన్నకేశవుని గరుడసేవ



శ్రీకాళహస్తి రూరల్: మండలంలో ఊరందూరులోని శ్రీకాళహస్తీశ్వర అనుబంధ శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం గరుడసేవను వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను పుష్పాలతో అలంకరించారు. గరుడ వాహనంపై అధిష్ఠింపజేసి గ్రామోత్సవం నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాలైన నారాయణపురం, పెంకులపాడు, విశాలాక్షినగర్, జింగిలిపాలెం, గుంటకిందపల్లె, మద్దిలేడు, శ్రీకాళహస్తి పట్టణం నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి హాజరయ్యారు. కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు బాలశంకరశర్మ భక్తులకు కుంకుమ, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఉభయ దాతలు బొజ్జల సుధీర్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, జంగాలపల్లి తులసీరామిరెడ్డి కుటుంబ సభ్యులు స్వామి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో అమాస చంద్రశేఖర్‌రెడ్డి, కాపిరెడ్డి విజయ్‌భాస్కర్‌రెడ్డి, లాయర్ గురవయ్య, దిలీప్, సాయి, శివ, నేతాజీ, ఏపీసీడ్స్ మాజీ డైరెక్టర్ గున్నేరి నీలకంఠారెడ్డి, జంగాలపల్లి అన్నపూర్ణమ్మ పాల్గొన్నారు.

మణిహారంలా మాస్టర్ ప్లాన్ రోడ్లు





ప్రారంభానికి సిద్ధంగా ఉన్న పరమాచార్య శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి మహాస్వామి మార్గం, విద్యుత్ వెలుగుల మధ్య తొండమాన్ చక్రవర్తి మార్గం

- ప్రారంభానికి సిద్ధమైన మరో రెండు రోడ్లు
- వాటికి శ్రీవారి సేవకుల పేర్లు
- రూ.10.5 కోట్లతో అభివృద్ధి

తిరుపతి తుడా: తిరుపతి నగరంలో మాస్టర్ ప్లాన్ రోడ్లు మణిహారంలా నిలుస్తున్నాయి. నగరంపై ఒత్తిడి తగ్గించడం, ట్రాఫిక్ చక్రబంధం నుంచి ఉపశమనం కలిగించడం, కనెక్టివిటీ పెంచడం, తూర్పు ప్రాంతంలో 3,500 ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధిని విస్తరించడమే లక్ష్యంగా మున్సిపల్ కార్పొరేషన్ 14 మాస్టర్ ప్లాన్ రోడ్లను అభివృద్ధి చేస్తోంది. ఇప్పటికే కరకంబాడి రోడ్డు - రేణిగుంట రోడ్డును కలుపుతూ అన్నమయ్య మార్గ్, డాక్టర్ వైఎస్సార్ మార్గ్ (డీబీఆర్) రోడ్లను పూర్తి చేసింది. 14 మాస్టర్ ప్లాన్ రోడ్లలో ఇదివరకే సామవాయి (చింతలచేను) మాస్టర్ ప్లాన్ రోడ్డును గతనెల 5న ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. ఈ క్రమంలో మరో రెండు మాస్టర్ ప్లాన్ రోడ్లు ప్రారంభానికి సిద్ధమయ్యాయి. ఈ నెల 7న రోడ్లను ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

రూ.10.5 కోట్లతో అభివృద్ధి

రేణిగుంట రోడ్డు నుంచి పూలవానిగుంట మీదుగా 1250 మీటర్ల పొడవుతో 80 అడుగుల రోడ్డును అభివృద్ధి చేశారు. మరో 300 అడుగులు(తుడా పరిధి) లింక్ ఇస్తే తిరుచానూరు నేషనల్ హైవేకి కలుస్తుంది. దీనికి రేణిగుంట రోడ్డు– నేషనల్ హైవే లింక్ రోడ్డుగా పునాది వేశారు. డివైడర్, మొక్కల పెంపకం, సెంట్రల్ లైటింగ్, బీటీ రోడ్డు అభివృద్ధికి రూ.7 కోట్ల మేర ఖర్చుచేశారు. అలానే గొల్లవానిగుంట– పూలవానిగుంట మాస్టర్ ప్లాన్ రోడ్లను కలుపుతూ మరో 650 మీటర్ల పొడవుతో 60 అడుగుల మాస్టర్ ప్లాన్ రోడ్డును పూర్తిచేశారు. ఇందుకోసం రూ.3.5 కోట్లు ఖర్చుచేశారు. ప్రస్తుతానికి ఈ రోడ్లు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి.

శ్రీవారి సేవకుల పేర్లు

ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి సూచనలతో మాస్టర్ ప్లాన్ రోడ్లకు తిరుమల శ్రీవారి సేవకుల పేర్లను పెడుతున్నారు. ఈ మేరకు గత కౌన్సిల్‌లో తీర్మానం చేశారు. చింతలచేను రోడ్డుకు ×సామవాయి₹ పేరు పెట్టారు. అలానే పూలవానిగుంట రోడ్డుకు పరమాచార్య శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి మహాస్వామి మార్గం, పూలవానిగుంట–గొల్లవానిగుంట లింక్ రోడ్డుకు శ్రీ తొండమాన్ చక్రవర్తి మార్గం₹గా నామకరణం చేశారు.

7న ప్రారంభోత్సవం

పరమాచార్య శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి మహాస్వామి మార్గం, తొండమాన్ చక్రవర్తి మార్గం మాస్టర్ ప్లాన్ రోడ్లను ఆదివారం ఉదయం 7 గంటలకు కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామి ప్రారంభించనున్నారు. ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష, కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్లు ముద్రనారాయణ, భూమన అభినయ్ రెడ్డి పాల్గొననున్నారు.

మాస్టర్ ప్లాన్ రోడ్ల పురోగతిపై సమీక్ష

తిరుపతి తుడా: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మాస్టర్ ప్లాన్ రోడ్ల పనులపై కమిషనర్ హరిత శుక్రవారం డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డితో కలిసి సమీక్షించారు. అనుకున్న సమయానికి పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ సునిత, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ శ్రీలేఖ, ఏసీటీ బాలసుబ్రమణ్యం, షణ్ముగం, కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ హరిత

సర్వం సిద్ధం

మాస్టర్ ప్లాన్ రోడ్లను ప్రారంభించేందుకు సర్వం సిద్ధం చేశాం. ఆదివారం ఉదయం ఈ రోడ్లను ప్రారంభిస్తారు. ఈ రోడ్లు నగరానికి కొత్తదనాన్ని తెచ్చిపెట్టాయి. మిగిలిన మాస్టర్ ప్లాన్ రోడ్లలను యుద్ధ ప్రతిపాదికన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాం.

–డి.హరిత, కమిషనర్, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్

లక్ష్యం నెరవేర్చే దిశగా అడుగులు

ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని నగర అభివృద్ధి కోసం వినియోగిస్తున్నా. గత పాలకులు మాస్టర్ ప్లాన్ రోడ్లను పూర్తిగా పట్టించుకోలేదు. ఇరుకు రోడ్లు, ట్రాఫిక్‌తో ప్రజల ఇబ్బందులను తీర్చాలన్న ధృఢ సంకల్పం పెట్టుకున్నాను. 14 మాస్టర్ ప్లాన్ రోడ్లతో ట్రాఫిక్ ఇక్కట్లు, నగరంపై ఒత్తిడి తగ్గుతుంది. కనెక్టివిటీ పెరుగుతుంది. బస్టాండ్‌కు కూతవేటు దూరం నుంచి 3,500 ఎకరాల్లో తిరుపతి విస్తరిస్తుంది.

–భూమన అభినయ్ రెడ్డి, డిప్యూటీ మేయర్

'గడప గడపకూ' పనులు వేగవంతం

తిరుపతి తుడా: నగరంలో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, ప్రతిపాదిత అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.హరిత ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆమె శుక్రవారం అధికారులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ గడప గడపకూ కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులు, ఇప్పటి వరకు పరిష్కరించినవి, పరిష్కరించాల్సిన పనులపై ఆరా తీశారు. అలానే నాడు–నేడు అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆరు నెలల క్రితం ప్రతిపాదించిన పనులను సైతం పూర్తి చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు పూర్తి చేయని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. నాడు–నేడు కింద మున్సిపల్ కార్పొరేషన్ నిర్వహణలోని 44 పాఠశాలల్లో పెండింగ్ పనుల ఆలస్యంపై మండిపడ్డారు. నగరంలో తాగునీటి సరఫరాపై పక్కా ప్రణాళికలు ఉండాలని, నిర్దేశించిన సమయంలోనే నీటి సరఫరా చేయాలని ఆదేశించారు. సమావేశంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ శ్రీలేఖ, ఎస్ఈ మోహన్, మున్సిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, డీఈలు విజయకుమార్ రెడ్డి, రవీంద్రారెడ్డి, సంజీవ్ కుమార్, మహేష్, మేనేజర్ చిట్టిబాబు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ హరిత

కార్పొరేషన్ సిబ్బందితో దురుసు ప్రవర్తన

తిరుపతి తుడా: ట్రేడ్ లైసెన్స్ పరిశీలన కోసం వెళ్లిన మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది, వార్డు సచివాలయ సెక్రటరీలపై శ్రీ బాలాజీ ఏజెన్సీస్ నిర్వాహకులు దురుసుగా ప్రవర్తించారు. అన్నమయ్య కూడలి నుంచి బైరాగిపట్టెడకు వెళ్లే రోడ్డులో ఉన్న శ్రీ బాలాజీ ఏజెన్సీస్‌లో శుక్రవారం ఈ ఘటన జరిగింది. శానిటరీ ఇన్‌స్పెక్టర్ యోగేంద్ర మీడియాతో మాట్లాడుతూ శ్రీ బాలాజీ ఏజెన్సీస్ నిర్వాహకులు ఆరేళ్లుగా ట్రేడ్ లైసెన్సుకు నగదు చెల్లించకుండా బెదిరిస్తున్నారని తెలిపారు. యూజర్ చార్జీలను సైతం చెల్లించకుండా సిబ్బందిని రోజుల తరబడి తిప్పించుకుంటున్నారని ఆరోపించారు. ట్రేడ్ లైసెన్సు తప్పనిసరి అని ఎన్నిసార్లు హెచ్చరించినా వార్డు సెక్రటరీని గంటల తరబడి నిలబెట్టి తర్వాత మళ్లీ రమ్మని చెబుతున్నారని పేర్కొన్నారు. ఈ క్రమంలో సచివాలయ, మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది పదిమంది వరకు వెళ్లడంతో అనుచితంగా ప్రవర్తించి బూతులు తిట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు.



సిబ్బందితో వాగ్వాదానికి దిగిన శ్రీ బాలాజీ ఏజెన్సీస్ నిర్వాహకులు

ఎన్‌ఎస్ఎస్ కోఆర్డినేటర్‌గా ప్రొఫెసర్ విద్యావతి



తిరుపతి ఎడ్యుకేషన్: పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్‌గా ప్రొఫెసర్ విద్యావతి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్‌గా విధులు నిర్వహించిన ప్రొఫెసర్ కాత్యాయని పదవీ కాలం ముగిసింది.

ముత్యాలమ్మ ఆలయానికి రూ.లక్ష విరాళం



నగదు అందజేస్తున్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డి కుటుంబ సభ్యులు

తిరుపతి రూరల్: చిగురువాడ గ్రామంలో వెలసిన ముత్యాలమ్మ ఆలయ అభివృద్ధికి అడపారెడ్డిపల్లికి చెందిన ప్రవీణ్ కుమార్ రెడ్డి, మౌనిక, మోక్షిత్ రెడ్డి కుటుంబ సభ్యులు రూ.లక్ష విరాళం ఇచ్చారు. వారిని ఆలయ ధర్మకర్త మునికృష్ణారెడ్డి అభినందించారు. దాత కుటుంబ సభ్యులకు అమ్మవారి దర్శనం కల్పించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

చంద్రగిరి కోటలో వెలుగులు పూసేనా..?

- కనిపించని లైటింగ్ అండ్ సౌండ్ షో
- ఏడాదికి రూ.30.50 లక్షల నష్టం
- పట్టించుకోని పర్యాటక శాఖ అధికారులు



చంద్రగిరి కోట

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి కోటలో సౌండ్ అండ్ లైటింగ్ షో మరమ్మతులకు గురై ఐదేళ్లు అవుతోంది. పర్యాటక శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఏడాదికి రూ.30.50 లక్షల నష్టం వస్తోంది. దీనిపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చంద్రగిరి కోట అభివృద్ధిలో భాగంగా శ్రీకృష్ణదేవరాయల విశిష్టతను అత్యాధునిక సాంకేతిక పద్ధతిలో పర్యాటకులకు తెలియజేసేందుకు లైట్ అండ్ సౌండ్ షోను 2000లో అప్పటి పర్యాటకశాఖ అధికారులు రూ.15 కోట్లతో ప్రారంభించారు. భారీ వర్షాలకు షో కంట్రోల్ రూమ్ లోకి వర్షపునీరు చేరడంతో పరికరాలు తడిచి తుప్పు పట్టాయి. విద్యుత్ వైర్లు సైతం ఎక్కడికక్కడ తెగిపోవడంతో వెలుగుల జిలుగుల షోను నిలిపివేశారు. చిన్నారుల నుంచి ముదుసలి వరకు అందరినీ ఆకట్టుకునే షో లేకపోవడంతో రోజు రోజుకు సందర్శకుల సంఖ్య తగ్గిపోతుంది.

మరో రూ.15 కోట్లు ఖర్చు చేసి..

దీనిపై పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో టూరిజం శాఖాధికారులు స్పందించారు. 2017లో మరో రూ.15 కోట్లు ఖర్చు చేసి అత్యధిక సాంకేతిక పరిజ్ఞానంతో నూతన హంగులు కలిగిన లేజర్ ఎల్ఈడీ లైట్లు, డిజిటల్ సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. 2018 జూన్‌లో ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఆ సమయంలో చంద్రగిరి కోట రాజమహల్ గోపురంపై పిడుగు పడింది. పురావస్తు శాఖ అధికారులు ఎర్త్ అరెస్ట్ పెట్టకపోవడంతో రాజగోపురం కొంత భాగం పాక్షికంగా దెబ్బతింది. సౌండ్ అండ్ లైటింగ్ షో మరమ్మతులకు గురైంది. షో కంట్రోల్ బోర్డు, సిగ్నల్ ప్రోసెసస్ బూస్టర్లు, కేబుల్స్, అత్యాఅధునిక లేజర్ లైట్లు కాలిపోయాయి. కంట్రోల్ బోర్డు మరమ్మతులకు రూ.80 లక్షలు అవుతాయని ఇంజినీర్లు చెప్పడంతో అధికారులు పట్టించుకోలేదు. 2018 జూన్ నుంచి షో లేదు. షో నిలిపివేయడం వల్ల సంవత్సరానికి దాదాపు రూ.20 లక్షలకు పైగా నష్టం కలుగుతోంది.

బోటింగ్ మూత

చంద్రగిరి కోటలో బోటింగ్‌ను కూడా ఏర్పాటు చేశారు. లైట్ అండ్ సౌండ్ షో మూసివేసిన రోజునే బోటింగ్ కూడా మూసివేశారు. దీంతో పర్యాటకులు నిరాశతో వెనుదిరుగుతున్నారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు ఎక్కువ మంది చంద్రగిరి కోటకు వస్తుంటారు. బోటింగ్ ఎత్తివేసి దాదాపు ఐదేళ్లు అవుతున్నా ఏర్పాటుచేయకపోవడంతో విద్యార్థులు నిరాశ చెందుతున్నారు. దీని ద్వారా కోటకు ఏడాదికి రూ.10.50 లక్షలకు పైగా నష్టం కలుగుతోంది. అధికారులు స్పందించి చంద్రగిరి కోటలో లైట్ అండ్ సౌండ్ షో, బోటింగ్ ఏర్పాటు చేయాలని పర్యాటకులు కోరుతున్నారు.

త్వరలో పునరుద్ధిస్తాం

చంద్రగిరి కోటలో పిడుగుపాటు వల్ల లేజర్ లైటింగ్ షో మరమ్మతులకు గురైంది. దీనిని పునరుద్ధించాలని ఇప్పటికే ప్రతిపాదనలు పంపించాం. త్వరలోనే పునరుద్ధిస్తాం.

–గిరిధర్‌రెడ్డి, డివిజనల్ మేనేజర్, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్, తిరుపతి

అమ్మవారిని దర్శించుకున్న విశాఖ శారద పీఠాధిపతి



స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు పద్మావతి అమ్మవారిని శుక్రవారం విశాఖ శారద పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి దర్శించుకున్నారు. వారికి అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా అధికారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అదే విధంగా సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జితేంద్ర కుమార్ మహేశ్వరి కుటుంబ సభ్యులతో కలసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఏఈఓ ప్రభాకర్ రెడ్డి, సూపరింటెండెంట్ శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కేతం జయచంద్రారెడ్డి జన్మదిన వేడుకలు



రక్తదాన శిబిరంలో కేతం జయచంద్రారెడ్డి



జయచంద్రారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న బ్యాంకు డైరెక్టర్లు

తిరుపతి మంగళం: తిరుపతి కో–ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. తిరుపతి టౌన్ బ్యాంకు ఆవరణలో ఉచిత వైద్య, రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సుమారు 200 మంది యువకులు రక్తదానం చేశారు. పెద్ద సంఖ్యలో షుగర్, బీపీ, డెంటల్ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అంతకు ముందు టౌన్ బ్యాంకు డైరెక్టర్లు, ఉద్యోగులు, వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు, ఆటో యూనియన్ నాయకులు, అభిమానులు కేతం జయచంద్రారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. తిరుపతి– కరకంబాడి రోడ్డులోని లెప్రసీ ఆసుపత్రిలో రోగులు, వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. 7వ డివిజన్ అధ్యక్షుడు చిమట రమేష్ పేదలకు చికెన్ బిర్యాని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 6వ డివిజన్ కార్పొరేటర్ పుల్లూరు అమరనాథ్‌రెడ్డి, టౌన్ బ్యాంకు డైరెక్టర్లు, పార్టీ నాయకులు నారాయణరెడ్డి, హరి, ప్రసాద్, బాలాజీ, సారథి, లోకేష్ పాల్గొన్నారు.

కనుల పండువగా ద్రౌపది కల్యాణం

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు మండలం యడమవారిపల్లె మహా భారత ప్రాంగణంలో చేపట్టిన మహా భారత ఉత్సవాల్లో శుక్రవారం ద్రౌపది కల్యాణం కనుల పండువగా సాగింది. ఇందుకు మహా భారత ఆలయ కమిటీ ఏర్పాట్లు చేపట్టింది. పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు అమ్మవారికి తలంబ్రాలు పోసి కోర్కెలను కోరుకున్నారు. కోర్కెలు తీరిన వారు అమ్మవారికి వడిబాలు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ద్రౌపది దేవి ధర్మరాజుల స్వామి అన్నదానం సొసైటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.



ద్రౌపది కల్యాణానికి హాజరైన భక్తులు

ప్రపంచానికి మార్గదర్శకుడు కారల్ మార్క్స్

తిరుపతి కల్చరల్: ప్రపంచ మానవాళి మనుగడకు కారల్ మార్క్స్ మార్గదర్శకుడని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కాంగో తెలిపారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శుక్రవారం కారల్‌మార్క్స్ జయంతిని ఘనంగా నిర్వహించారు. అనంతరం గంధమనేని శివయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన జయంతి సభలో ఆయన కారల్‌మార్క్స్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచ గమనాన్ని మార్చేందుకు శ్రామిక దృష్టితో వర్గ సిద్ధాంతాన్ని అందించిన గొప్ప వ్యక్తి కారల్ మార్క్స్ అని కొనియాడారు. దోపిడీ వ్యవస్థను రూపు మాపి కార్మిక రాజ్యం రావాలంటే మహత్తర పోరాటాలు చేయాలని సూచించారని వివరించారు. అనంతరం వివిధ ప్రాంతాల్లో జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో రామానాయుడు, చిన్నం పెంచలయ్య, రాధాక్రిష్ణ, రాజశేఖర్, విశ్వనాథ్ పద్మనాభరెడ్డి, బి.నదియా, ప్రొఫెసర్ అనిరాజం వాలే యుగల్ రాయులు పాల్గొన్నారు.



కారల్‌మార్క్స్‌కు నివాళులర్పిస్తున్న కాంగో

ప్రగతి పథంలో అగరాల



నూతనంగా ఏర్పాటు చేసిన సీసీరోడ్డు




గ్రామ సచివాలయ భవనం

- రూ.ఐదు కోట్లతో పనులు
- 100 శాతం అభివృద్ధే లక్ష్యం
- సర్పంచ్ భాస్కర్‌రెడ్డి

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలం అగరాల గ్రామం అభివృద్ధి దిశగా దూసుకుపోతుంది. చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి చొరవతో ప్రతి గ్రామంలోనూ సీసీరోడ్లు, నీటి ట్యాంకులు ఏర్పాటయ్యాయి. తాగునీటి బోర్లు, పొలాల దగ్గరకు రోడ్లు వేశారు. అధునాతన వసతులతో సచివాలయ భవనం, ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం చేపట్టారు. చంద్రగిరి మండలం అగరాల పంచాయతీ ఓ చిన్న కుగ్రామం. నాలుగు గ్రామాలు, 2000 పైగా జనాభా ఉంది. ఒకప్పుడు తాగునీటి సమస్య తీవ్రంగా ఉండేది. రోడ్లు సరిగా ఉండేవి కావు. చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అందించిన సహాయ సహకారాలతో అగరాల గ్రామ సర్పంచ్ తూకాకుల భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రస్తుతం పంచాయతీలోని అన్ని గ్రామాల్లో ప్రతి వీధిలోనూ సీసీ రోడ్డు ఏర్పాటుచేశారు. పొలాలకు వెళ్లే కాలిబాటలు సైతం గ్రామీణ రోడ్లుగా రూపుదిద్దుకున్నాయి. పంచాయతీ పరిధిలో రూ.2 కోట్లను సీసీ రోడ్లకే ఖర్చు చేశారు. సచివాలయం, ధ్యాన మందిరం, కమ్యూనిటీ హాలు, హెల్త్ సెంటర్ తదితరాలకు మరో రెండు కోట్లు కేటాయించారు. తాగునీటి సమస్య లేకుండా చేశారు. రూ.ఐదు కోట్లతో గ్రామం అందంగా రూపుదిద్దుకుంది.

అభివృద్ధే ధ్యేయం



అగరాలలో 100 శాతం అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నాం. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి నిరంతరం సహకరిస్తూ అభివృద్ధిలో పెద్దన్నలా పాలుపంచుకుంటున్నారు. ఇప్పటికే రూ.కోట్లతో ప్రభుత్వ భవనాలు నిర్మించాం. కొన్ని నిర్మాణ దశలో ఉన్నాయి. వాటిని రెండు నెలలు పూర్తి చేస్తాం. కోర్టు కేసుల వల్ల ఆలస్యమైన జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి.

–తుకాకుల భాస్కర్ రెడ్డి, సర్పంచ్, అగరాల, చంద్రగిరి మండలం

ముగిసిన వెంగమాంబ జయంతి ఉత్సవాలు



తిరుపతి కల్చరల్: అన్నమాచార్య కళా మందిరంలో నిర్వహించిన తరిగొండ వెంగమాంబ జయంతి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. చివరి రోజు ఎంఆర్‌పల్లి సర్కిల్‌లో ఉన్న వెంగమాంబ విగ్రహానికి టీటీడీ అధికారులు పుష్పాంజలి ఘటించారు. అన్నమాచార్య కళామందిరంలో అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు మధుసూదనరావు బృందం సంగీత గానామృతం భక్తులకు ఆకట్టుకుంది. చంద్రశేఖర్ భాగవతార్ హరికథా గానం అలరించింది. ఎస్వీ సంగీత నృత్య కళాశాల అధ్యాపకుల నృత్య రూపకం కమనీయంగా సాగింది.